● సామ్ వెడ్స్ రాజ్



తిరుపతి కోడలు సమంత

నటి సమంత పెళ్లి చేసుకుంది. తిరుపతికి కోడలైంది. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ నిర్మాత, దర్శకుడు, రచయిత రాజ్ నిడిమోరును కోయంబత్తూరులో ఈషా కేంద్రంలోని లింగ భైరవ ఆలయంలో సోమవారం వివాహం చేసుకుంది. రాజ్‌ది తిరుపతి. 1975 ఆగస్టు 4న జన్మించారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేస్తుండగా సహచర విద్యార్థి కృష్ణ డీకే ఇతడికి పరిచయమయ్యారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా డీకేతో కలసి సినిమాటోగ్రఫీలో ప్రవేశించారు. ఎనిమిది సినిమాలకు దర్శకుడిగా, రచయితగా పని చేశారు. 2015లో శ్యామల అనే అసిస్టెంట్ డైరెక్టర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె ఉంది. 2022లో విడిపోయారు. ఇతడు తీసిన స్త్రీ సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. ఇతడి దర్శకత్వంలో సమంత నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్ సూపర్ హిట్ అయ్యింది. ఇటీవల సమంత నిర్మించిన శుభం చిత్రానికి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్‌తో వీరి మధ్య పరిచయం ఏర్పడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి






విరిగిన ఏనుగు కాలుకు స్కానింగ్ - లారీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది -తిరుపతికి లారీలో తరలింపు -జూలో క్రేన్ సాయంతో లారీలోంచి కిందకు దించుతూ...

'ఆపరేషన్ గజ' సక్సెస్

కాలు విరిగిన ఏనుగుకు కుంకీల సాయం

ఎస్వీ జూకు తరలించి వైద్య చికిత్సలు

యాదమరి/మంగళం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఒంటరి ఏనుగును తరలించేందుకు అటవీశాఖ చేపట్టిన 'ఆపరేషన్ గజ' సోమవారం విజయవంతంగా ముగిసింది. భారీ క్రేన్ సాయంతో ఏనుగును లారీలో ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి తరలించారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వారం క్రితం యాదమరి మండలంలోకి ప్రవేశించిన ఈ ఒంటరి ఏనుగు రెండ్రోజుల క్రితం డీకే చెరువు సమీపంలోని కమ్మపల్లి అటవీ బీట్ గుడ్డివానిచెరువు వద్ద జారిపడడంతో కాలు దెబ్బతిని కదల్లేని స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆదివారం సీసీఎఫ్ యశోదా బాయి ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, వైద్యులు వచ్చి పరిశీలించారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు నుంచి కుంకీ ఏనుగులు కృష్ణ, అభిమన్యులను రప్పించి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సహాయక చర్యలు చేపట్టారు. చెరువు నుంచి కుంకీల సాయంతో ఒంటరి ఏనుగును బయటకు తీసుకొచ్చారు. అప్పటికి చీకటి పడడంతో ఆపరేషన్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది తమ ప్రయత్నాలను పునః ప్రారంభించారు. కుంకీల సహాయంతో దెబ్బతిన్న ఏనుగును కదలకుండా చేశాక దెబ్బతిన్న ఏనుగు కాలును స్కాన్ చేశారు. అనంతరం భారీ క్రేన్‌ను ఉపయోగించి ఏనుగును క్షేమంగా లారీలోకి ఎక్కించారు. అటవీ, పోలీసుల కాన్వాయ్ సహకారంతో ఏనుగును సోమవారం మధ్యాహ్నానికి తిరుపతిలోని ఎస్వీ జూకు తీసుకొచ్చారు.ఈ తరలింపు ప్రక్రియను డీఎఫ్‌వో శ్రీనివాసులు, రేంజర్లు థామస్, పట్టాభి తదితరులు పర్యవేక్షించారు. జూకు తీసుకువచ్చిన ఏనుగును అధికారులు అతికష్టం మీద భారీక్రేన్ సాయంతో ఏనుగుల ఎన్‌క్లోజర్‌లోకి పంపారు. ఏనుగుకు వెనుకవైపు ఉన్న ఎడమకాలు విరిగిందని జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్‌చంద్ర ప్రసాద్ తెలిపారు. కాలుకు ఎక్స్‌రే తీసి బ్లడ్ శాంపిల్స్ సేకరించామని... ఏనుగు ఆరోగ్యం బాగానే ఉందని కాలు విరగడం వల్ల నడవలేకపోతోందని చెప్పారు. ఇప్పటికే ఏనుగుకు ఇద్దరు డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని ఆహారం కూడా తీసుకుందని వివరించారు.



ఎన్‌క్లోజర్‌లోకి ఏనుగు తరలింపు

స్థలమున్నవారికి ఇల్లు.. లేనివారికి స్థలం

ఇంటి కోసం దరఖాస్తు గడువు పొడిగింపు



జీడీనెల్లూరు మండలం వేల్కూరులో ఇంటి మంజూరు కోసం సర్వే

● ఇప్పటికే 46,767 మంది దరఖాస్తు ● వీరిలో స్థలం కోసం చేసుకున్నవారు 7,907

చిత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలమున్నవారికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు లేనివారికి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇంటి నిర్మాణం కోసం పేదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించనున్నాయి. అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు నవంబరు 30తో ముగియగా, తాజాగా ఈ నెల 14వ తేదీ వరకు గడువును పొడిగించారు.

అంచనాకు మించి దరఖాస్తులు: జిల్లాలోని సచివాలయ సిబ్బంది నవంబరులో అర్హుల కోసం చేసిన సర్వేలో 46,767మంది సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 7,907మంది సొంత స్థలం కావాలని కోరారు. నవంబరు నెలాఖరు నాటికి గడువు ముగుస్తుందనడంతో అర్హుల వివరాలను సచివాలయ సిబ్బంది సేకరించారు. హౌసింగ్ అధికారుల అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. తాజాగా పొడిగించిన గడువు వల్ల మరో 5 వేల మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని హౌసింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో తీర్మానం: ఇల్లు మంజూరు కోసం సొంత స్థలం, తెల్ల రేషన్ కార్డు, గ్రామాల్లో అయితే ఉపాధిహామీ జాబ్‌కార్డు అర్హతలు. జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను మరోసారి ఏఈ స్థాయిలో వెరిఫై చేసి ఫైనల్ చేస్తారు. ఆయా దరఖాస్తులను గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసి అర్హులకు మంజూరు చేస్తారు.

అర్హులకు పట్టాలు అందించే ఆలోచన: స్థలం లేనివారి విషయంలో కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అర్హులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా జిల్లా అధికారులు లేఅవుట్‌కు అనుగుణంగా స్థలాల్ని గుర్తించే పనిలో ఉన్నారు. ప్రస్తుతానికి 7,907 మంది ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

కేంద్ర వాటా రూ.1.50 లక్షలు.. రాష్ట్ర వాటా రూ.లక్ష: హౌసింగ్ పథకంలో కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం చేయనుంది. 2014లో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడినప్పటి నుంచీ ఇదే యూనిట్ కాస్ట్ ఉంది. 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం దీనికి అదనంగా పట్టణాల్లో రూ.లక్ష వేసింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య రాష్ట్ర వాటా నయాపైసా ఇవ్వలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రూ.లక్ష రాష్ట్ర వాటాగా ఇచ్చేందుకు నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర వాటాపై ఇంకా స్పష్టత రాలేదు.



చూడ ముచ్చటగా ఎక్స్‌ప్రెస్ హైవే

గుడిపాల సమీపంలోని చెరువు మీద వెళ్తున్న చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే ఫొటో ఇది.చిత్తూరుకు తలమానికంగా మారనున్న ఈ హైవే పనులు చివరి దశకు చేరుకున్నాయి.పలమనేరు సమీపంలో ఏనుగుల కోసం అత్యాధునిక అండర్ పాస్ కూడా నిర్మిస్తున్నారు. గుడిపాల సమీపంలో ఈ హైవేకు చిత్తూరు-తచ్చూరు హైవే కూడా లింక్ అవుతోంది. ఈ రెండు హైవేలతో మరింత వేగంగా జిల్లా అభివృద్ధి జరగనుంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

తప్పిన దిత్వా ముప్పు!

బలహీనపడిన తుఫాను

మరో రెండు రోజులు వర్ష సూచన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 'దిత్వా' ముప్పు తప్పింది. తుఫాను బలహీన పడినా.. దాని ప్రభావంతో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం రాత్రి ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి మీదుగా చెన్నైకు తూర్పు 10 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. అర్ధరాత్రికి వాయుగుండం బలపడే అవకాశం ఉంది. దీంతో మంగళవారం జిల్లాలో మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ తెలియజేసింది. మరోవైపు సోమవారం తెల్లవారు జాము నుంచి ముసురు కమ్ముకోవడంతోపాటు చల్లటి గాలులతో చలి తీవ్రత పెరిగింది. దిత్వా తుఫాను ప్రభావంతో సోమవారంజిల్లాలోని పలుమండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా సోమల మండలంలో 14 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కార్వేటినగంలో 12, విజయపురంలో 7.4, ఎస్ఆర్ పురంలో 7.2, వెదురుకుప్పంలో 6.4, రొంపిచెర్లలో 6, నగరిలో 5.6, నింద్రలో 4.6, చౌడేపల్లె, పులిచెర్ల మండలాల్లో4.4, రామకుప్పంలో 3.6, పాలసముద్రంలో 3.4, జీడీనెల్లూరులో 3.2, సదుంలో 2.8, పెద్దపంజాణిలో 2.2, శాంతిపురంలో 2, పెనుమూరులో 1.8, వి.కోటలో 1.6, పూతలపట్టులో 1.2, బైరెడ్డిపల్లెలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

పెన్షనతో పాటు శ్రీవారి లడ్డూ ప్రసాదం



శ్రీవారి లడ్డూ ప్రసాదం తీసుకున్న ప్రజలతో పీఎస్ మునిరత్నం, శాంతారాం

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుప్పం నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకు ఒక్కో కాలనీ చొప్పున సుమారు 100-150 మంది పింఛనుదారులకు శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందించనున్నట్లు టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు. కుప్పం మండలం కంగుంది పంచాయతీ ఎస్సీ ఎస్టీ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నంతో కలిసి పింఛన్లతోపాటు తనవెంట తెచ్చిన శ్రీవారి ప్రసాదమైన లడ్డూను పంపిణీ చేశారు. నిరుపేదల్లోనే దైవం కొలువుంటాడని భావించి, అటువంటి ప్రత్యక్ష దైవాలకు ఆ తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని సభక్తికంగా సమర్పించుకుంటున్నామన్నారు. పింఛను నగదుతోపాటు వెలలేని శ్రీవారి లడ్డూ ప్రసాదం అందడంతో కాలనీ ప్రజలు అపరిమితమైన ఆనందం వ్యక్తం చేశారు.

94.55శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ తొలిరోజైన సోమవారం 94.55 శాతం పూర్తయింది.జిల్లావ్యాప్తంగా 2,67,292 మందికిగాను 2,52,732 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మిగిలిన 14,560 మందికి మంగళవారం అందించనున్నారు.కాగా పింఛన్ల పంపిణీలో 95.18 శాతంతో కుప్పం పురపాలక సంఘం జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. అంతేకాదు, ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోని శాంతిపురం, కుప్పం మండలాలు పింఛన్ల పంపిణీలో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. శాంతిపురం మండలంలో 8,613 పింఛన్లుండగా 8,166 పింఛన్లు పంపిణీ చేసి 94.81 శాతంతో ద్వితీయ స్థానం సాధించింది. అలాగే కుప్పం మండల పరిధిలో 9,763 పింఛన్లుండగా 9167 పింఛన్లు పంపిణీ చేసి 93.9 శాతంతో తృతీయ స్థానం పొందింది. పాలసముద్రం మండలం 86.64 శాతం మాత్రమే పింఛన్లు పంపిణీ చేసి ఆఖరు స్థానంలో నిలిచింది.

చాపకిందనీరులా.. స్క్రబ్ టైఫస్

● వారం రోజుల్లో 10 కేసులు
● ఓ మహిళకు ఐసీయూలో చికిత్స

చిత్తూరు రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ చాపకిందనీరులా వ్యాప్తి చెందుతోంది. గత వారం రోజుల్లో 10 మంది ఈ వ్యాధి బారిన పడినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం బంగారుపాళ్యం మండలానికి చెందిన ఓ మహిళ ఈ వ్యాధితో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అలాగే గుడిపాల మండలానికి చెందిన మరో వ్యక్తి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు.రాష్ట్రవ్యాప్తంగా చూస్తే జిల్లాలోనే అత్యధిక కేసులు నమోదయినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడం విమర్శలపాలవుతోంది.

60 స్కూల్ బస్సులకు నోటీసులు

● డీటీసీ నిరంజన్ రెడ్డి



చిత్తూరు సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు రవాణాశాఖ అధికారులు వెళ్లి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గత నెల 1 న జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్, కళాశాలల యజమాన్యాలతో డీటీసీ నిరంజన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. బస్సుల నిర్వహణకు గడువు ఇచ్చారు. ఈక్రమంలో గత వారం రోజులుగా తనిఖీలు ముమ్మరం చేశారు. గత వారం రోజుల నుంచి దాదాపు 200 పాఠశాల బస్సులను తనిఖీ చేసి, 60 బస్సులకు నోటీసులిచ్చినట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇకపై నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్యాలు బస్సులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, విద్యార్థుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

టీడీపీ పరిస్థితిపై లోకేష్ ఆరా

పలమనేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులకు సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున హాజరైన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో పార్టీ పరిస్థితి గురించి మంత్రి లోకేష్ చర్చించారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, మంత్రి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.






ఐఐటీలో కాన్ఫరెన్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

త్వరలో కొత్త పరిశ్రమలు

● ఐఐటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ

ఏర్పేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీకి త్వరలో కొత్త పరిశ్రమలు రానున్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో 8వ భారతీయ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన సోమవారం జరిగిన ఇండస్ట్రీ డే సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారనిచెప్పారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం లీన్ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియలను అమలు చేసి నిర్మాణరంగంలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యర్థాలను తగ్గించడంపై దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం తరపున హాజరైన నిపుణులతో లీన్ కన్‌స్ట్రక్షన్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులపై ఆయన చర్చించారు. విద్యారంగంలోని పరిశోధనలను, పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయాలనే లక్ష్యమని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ ఇండస్ట్రీడే భారత నిర్మాణ రంగ భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు అకడమిక్ కఠోరతను, పరిశ్రమను ఉత్తమంగా మార్చడంలో ఐఐటీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. పారిశ్రామికవేత్త అనుప్ మాథ్యూ, ఐఎల్‌సీఈ సెక్రటరీ జనరల్ కైజాద్ కరంజావాలా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,187


తలనీలాలు సమర్పించినవారు: 25,027



నీటి ఏనుగు



అడవి జింక



విదేశాల నుంచి తెచ్చిన మీర్‌కాట్ పిల్లలు



బూడిదరంగు కోళ్లు



చుక్కల దుప్పి పిల్లలు



అడవిపందులు



అడవిదున్న



థామిన్ జింక

కొత్త ప్రాణులకు పురుడుపోస్తున్న జూపార్కు

ఆసియా ఖండంలో అతిపెద్దదైన శ్రీవేంకటేశ్వర జూపార్కులో జంతు సంతతి క్రమంగా పెరుగుతోంది. 85రకాల వన్యప్రాణులున్న తిరుపతి జూలో వయసు, అనారోగ్య కారణాలతో కొన్ని మృతి చెందుతున్నాయి. మరోవైపు ఉన్న వన్యప్రాణులు కొత్తవాటికి జన్మనిస్తూ సంతతిని పెంచుకుంటున్నాయి. ఇతర దేశాల నుంచి తీసుకువచ్చినవి, మనదేశంలోని ఇతర జూల నుంచి తీసుకువచ్చిన వన్యప్రాణుల్లో మీర్‌కాట్, అడవి దున్న, బూడిదరంగు అడవి కోడి, నీటి ఏనుగు, అడవి జింక, అడవి పంది, చుక్కల దుప్పి, థామిన్ జింక వంటివి ఇక్కడే సంతానాన్ని వృద్ధి చేసుకున్నాయి. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడి వాతావరణంలో ఇమడలేని కొన్ని ప్రాణులు మరణించాయని, రెండు నెలలలోనే మరి కొన్ని ఇక్కడే కొత్తవాటికి జన్మనిచ్చాయని తిరుపతి జూపార్క్ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఇక్కడే పుట్టిన ప్రాణులు ఈ వాతావరణానికి అలవాటు పడినట్లే. అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. అని ఆయన చెప్పారు. ఇతర జూల నుంచి వచ్చిన వాటి కోసం కొత్త ఎన్‌క్లోజర్‌లు సిద్ధం చేస్తున్నామని చంద్రప్రసాద్ తెలిపారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

పాపవినాశనం డ్యాం ఎంత భద్రం?

● అధ్యయనం చేస్తున్న కేంద్ర శాస్త్రవేత్తలు

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాపినాశనం డ్యాం పటిష్టత ఏ స్థితిలో ఉందో కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం పరిశీలిస్తోంది. 42 ఏళ్ల కిందట తిరుమల నీటి అవసరాల కోసం నిర్మించిన ఈ డ్యామ్ భద్రతపై టీటీడీ దృష్టి పెట్టింది. ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు కూడా ఈ ఏడాది ఫిబ్రవరిలో పావినాశనం డ్యాంను పరిశీలించారు. డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేస్తే మరో 30 ఏళ్ల దాకా ఇబ్బంది లేదని సలహా ఇచ్చారు. అలాగే నేషనల్ డ్యాం సేఫ్టీ యాక్ట్ కింద కేంద్ర జలశక్తి విభాగానికి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ ను అధ్యయనం చేయాల్సిందిగా టీటీడీ కోరింది. ఇందులో భాగంగా నవంబరు 26 నుంచి జలవనరుల శాఖ సీఈ వరప్రసాద్, ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, ఈఈ రవిశంకర్‌రెడ్డి, టీటీడీ ఈఈ సుధాకర్ ఆధ్వర్యంలో సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు సెంథిల్, జాలే లింగేస్వామి, దీపక్‌కుమార్ శర్మ బృందం పాపవిశానం డ్యాంను పరిశీలిస్తోంది. డ్యాములో నీటి కిందభాగానికి రిమోట్ ద్వారా ఒక యంత్రాన్ని పంపారు. కిందభాగంలోని పలు ప్రాంతాల్లో ఫొటోలను తీస్తున్నారు. డ్యాం అడుగుభాగం ఎంత పటిష్ఠంగా ఉందో దీనిద్వారా నిర్ధారించుకుంటారు. మరో రెండు రోజుల్లో పరిశీలనను పూర్తిచేసి నివేదికను రాష్ట్ర జలవనరుల శాఖ విభాగానికి అందజేయనున్నారు.





పాపవినాశనం డ్యాం వద్ద సీఎస్ఎంఆర్ఎస్ బృందం - నీటిలోకి పంపుతున్న రిమోట్ ఆపరేట్ వెహికల్

తిరుమలలో 5 డ్యాములు: తిరుమల కొండపై ప్రస్తుతం ఐదు డ్యాములు ఉన్నాయి. 1963లో గోగర్భం డ్యామును నిర్మించింది. ఆతర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో 1983లో పాపవినాశనం డ్యామును నిర్మించారు. 2002లో ఆకాశగంగ, 2011లో జంటప్రాజెక్టులుగా పిలిచే కుమారధార, పసుపుధార డ్యాములను నిర్మించారు. వీటి మొత్తం నిల్వ సామర్థ్యం 14,303 లక్షల గ్యాలన్లు.

డయల్ యువర్ సీఎండీకి 62 వినతులు



వినియోగదారుల సమస్యలు వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 9 జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ ద్వారా తమ సమస్యలను సీఎండీ లోతేటి శివశంకర్ దృష్టికి తెచ్చారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, కాలిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా మార్చాలని, విద్యుత్ లైన్లు మార్పు చేయాలని, లోఓల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. గతనెల 24వ తేదీ వరకు వచ్చిన 265 ఫిర్యాదుల్లో 118 పరిష్కరించామన్నారు. వినియోగదారులు సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333కి కాల్ చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 9133331912కు చాట్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోబావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటరాజు, విజయన్ పాల్గొన్నారు.

'గూడూరు' సమస్య పరిశీలించండి

● మంత్రి అనగానికి ఎమ్మెల్యే సునీల్ వినతి
● సత్యవేడులో ఇన్‌చార్జి చెప్పినట్లు వినాల్సిందేనన్న అనగాని
● తిరుపతిలో టీడీపీ శ్రేణులు, ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతికి సుమారు మూడు నెలల తర్వాత సోమవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బిజీబిజీగా గడిపారు. ఉదయం జీవకోనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన రేణిగుంట రోడ్డులోని టీడీపీ పార్లమెంటు కార్యాలయానికి చేరుకున్నారు. ఆ పార్టీ నేతలు, శ్రేణులు, ప్రజలను కలుసుకున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరుజిల్లాలో విలీనంచేసేఅంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంత్రిని అభ్యర్థించారు. పలువురు నాయకులతో కలసి బృందంగా వచ్చిన ఆయన మంత్రి ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ ఎన్నికల్లో హామీలిచ్చారని గుర్తుచేశారు. మంత్రుల ఉపసంఘం తొలుత చేసిన సిఫారసుల్లో గూడూరు విలీనం అంశంఉందని, తీరా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయంలో దాన్ని పక్కన పెట్టిందని వాపోయారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి..తిరిగి నెల్లూరులో విలీనం చేసేలా ఒప్పించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం కూడా అందజేశారు.

వైసీపీ నుంచీ వచ్చిన వారికే ప్రాధాన్యం: సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల నుంచి పలువురు కార్యకర్తలు మంత్రిని కలిశారు. వైసీపీనుంచీ వచ్చినవారికే పనులు జరుగుతున్నాయని, సమన్వయకర్త వారినే వెంటపెట్టుకుని ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. 'ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి, పనిచేసినవైసీపీవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఎన్నికల తర్వాత చేరిన వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చేది లేదు. అధిష్ఠానం సమన్వయకర్తగా నియమించిన శంకర్‌రెడ్డిమాటకే పార్టీలో విలువ ఉంటుంది. శ్రేణులు ఆయన్ను అనుసరించుకుని వెళ్లాలి. నానియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్య ఉంది. నేనూ అధిష్ఠానం ఆదేశాల్ని గౌరవించి అందరినీ కలుపుకొని పోతున్నా' అని మంత్రి సమాధానమిచ్చారు.

కార్పొరేటర్ అన్నా సంధ్యకు పరామర్శ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న జీవకోన కార్పొరేటర్ అన్నా సంధ్య ఇంటికెళ్లి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. పార్టీతో పాటు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో టీడీపీ పార్లమెంటు కార్యాలయ భవనానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన భూమిని మంత్రి అనగాని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యాలయానికి చేరుకుని నేతలను కలుసుకున్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పనుసులేటి హరిప్రసాద్ నివాసానికీ మంత్రి వెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జి.నరసింహ యాదవ్, సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సత్యవేడు టీడీపీ ఇంచార్జి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, గంగమ్మ గుడి చైర్మన్ మహేశ్ యాదవ్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, ఎస్కే బాబు, నరేంద్ర, నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. చిత్తూరు ఎస్పీ తుషార్ దూడి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా సదుం మండలం బోరగమందకు చెందిన పి.వెంకటరమణ, ఆ మండలానికే చెందిన మల్లెల హరినాథ్ 2018లో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా అప్పటి పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసును చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదలాయించారు. కొన్ని నెలలుగా ఇక్కడ కేసు విచారణ జరిగింది. కేసుకు సంబంధించి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి రొంపిచెర్ల ఎస్ఐ జయరాంనాయక్, ప్రస్తుత ఎస్ఐ హరిప్రసాద్, కోర్టు లైజనింగ్ కానిస్టేబుల్ రవి, నిందితులకు సంబంధించి సాక్ష్యాధారాలు కోర్టు ఎదుట సాక్ష్యాధారాలు హాజరుపరచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కౌశల్



గౌతమ్ రాజు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు గౌతమ్ రాజు, కౌశల్, తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడి ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

● సురుటుపల్లి ఆలయ ఈవోపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

నాగలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులకు మధ్య ప్రొటోకాల్ రగడ ముదురుతోంది. నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వర ఆలయంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఈవో లతపై సోమవారం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు రోజుల క్రితం ఆలయంలో శని ప్రదోష పూజల నిమిత్తం ముద్రించిన కరపత్రాల్లో స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పేరు లేదంటూ కొందరు వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఆలయంలోని ఈవో కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ప్రొటోకాల్‌పై నిలదీశారు. ఈవో వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారంటూ విమర్శించారు. పాలకమండలి ఆత్మీయ సమావేశం పేరుతో ఆలయంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయ ట్రస్టు బోర్డు నియామకం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్న వ్యక్తికి చైర్మన్‌గా ఎలా చోటు కల్పిస్తారని నిలదీశారు. గతంలో టీటీడీలో బంగారు నగల దొంగతనం కేసులో నిందితుడిని.. చెన్నైలో స్థిర నివాసమున్న మహిళను సభ్యులుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బోర్డు నిబంధనల మేరకు గిరిజనులకు ఎందుకు చోటు కల్పించలేదని అడిగారు. ప్రొటోకాల్ విషయమై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. కాగా, నూతన సంవత్సరంలో శివయ్య ఎలాఅనుగ్రహిస్తే అలా నిర్ణయం తీసుకుంటానని ఈ సందర్భంగా ఆదిమూలం పేర్కొనడం గమనార్హం. టీడీపీ నాయకులు మురళి, ఎస్ఎం సురేష్, మురళి, సర్పంచ్ కాంతమ్మ, సుబ్రహ్మణ్యం, అంబేడ్కర్ సంఘ నాయకుడు జై భీమ్ అధ్యక్షుడు ధన తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోని కార్యాలయంలో ఈవోని నిలదీస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

చైర్మన్ చెబితేనే చేశా: ఈవో

ఆలయ కరపత్రాలపై ఎమ్మెల్యే పేరును ముద్రించకపోవడంపై ఈవో లత వివరణ ఇస్తూ... చైర్మన్ చెబితేనే చేశానన్నారు. ఒకసారికి క్షమించాలని ఇంకెప్పుడు ఇలాంటి ఘటన పునరావృత్తం కాకుండా చూసుకుంటానంటూ ఎమ్మెల్యేకి చెప్పారు. 'ఆలయాలకు చైర్మన్లు వస్తారు పోతారు. ఇక్కడ భక్తుల సేవే పరమావధిగా ఉండాలి. చైర్మన్ చెబితే తరతరాలుగా ఉభయదారులుగా వ్యవహరిస్తున్న వారిని కూడా మార్చేస్తారా?' అంటూ ఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు.

నకిలీ సీఐ అరెస్ట్



శివకుమార్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని సీఐ అవతారంలో బెదిరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ అప్పేపల్లెకు చెందిన రెడ్డి ఈశ్వర్, భానుశ్రీ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. భానుశ్రీ తరఫున కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెకు చెందిన శివకుమార్ తాను కడప స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, భానుశ్రీని వేధిస్తే చర్యలు తప్పవని రెడ్డి ఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో శివకుమార్‌పై రెడ్డి ఈశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి శివకుమార్ సీఐ కాదని నిర్ధారించుకుని అతని కోసం గాలింపు చేపట్టారు. భాకరాపేట సమీపంలోని మామా బావమరిది హోటల్ సమీపంలో సోమవారం అతన్ని అరెస్టు చేశారు. శివకుమార్ ఇంతకు ముందు ఉద్యోగం తీసిస్తానని కలకడ మండలానికి చెందిన ఆంజనేయులు దగ్గర రూ.8 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, ట్రైనీ ఎస్ఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

బాలాజీ సేవలు అభినందనీయం



బాలాజీ దంపతుల్ని సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిగా బాలాజీ క్రీడా రంగానికి అందించిన సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అనంతరం జిల్లా అధికారుల సంఘం, జిల్లా రెవెన్యూ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్‌డీఓగా పదవీ విరమణ చేసిన బాలాజీ, ఆయన సతీమణిని కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, జిల్లా అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యం కేసు 19కి వాయిదా

పూతలపట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివంగత మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య ఘటనలో తప్పుడు సాక్ష్యం చెప్పిన 14 మందికి సంబంధించిన కేసును ఈనెల 19వ తేదీకి న్యాయమూర్తి శ్రీనివాసరావు వాయిదా వేశారు. పదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు చింటూతో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో నిందితులైన చింటూతో పాటు మరో నలుగురికి గతనెల 30న 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు ఉరిశిక్ష వేసిన విషయం తెలిసిందే. కాగా కేసులో 14 మంది కోర్టుకు తప్పుడు సాక్ష్యం చెప్పారని న్యాయస్థానం నోటీసులు జారీచేసింది.వారంతా సోమవారం కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి కేసును ఈనెల 19వ తేదికి వాయిదా వేశారు.

విద్యార్థులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ కానుక



సైకిళ్లను అందజేస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

తవణంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెల్లగుండ్లపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. ఇటీవల శాఖాపరమైన పర్యటనలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. 4వ తరగతి చదువుతున్న వైష్ణవి, తరుణ్ చూపిన ప్రతిభకు ఆయన ముగ్దులై ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు.రూ.8 వేల విలువ గల సైకిళ్లను కొనుగోలు చేసి ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, డీఈ ముని చంద్ర ద్వారా అందజేయించారు. డీవైఈవో ఇందిర, ఎంఈవో మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న కాణిపాకంలో సత్యనారాయణ వ్రతం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయంలో ఈ నెల 4న పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈనెల 8న ఆలయ ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించి సాయంత్రం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుని ఉత్సవమూర్తులను స్వర్ణ రథంపై ఊరేగించనున్నట్లు వివరించారు. సత్యనారాయణ స్వామి వ్రతం, సంకటహర గణపతి వ్రతాలకు భక్తులు టికెట్టు కొనుగోలు చేసి పాల్గొనవచ్చునన్నారు.

చిరుత పిల్లల దాడిలో మహిళకు స్వల్ప గాయాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్వో రాకేష్‌కుమార్

ఐరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుత్రమద్ది గ్రామం సమీపంలోని అటవీప్రాంతం వద్ద సోమవారం కాంతమ్మ అనే మహిళను చిరుత పిల్లలు గాయపరిచాయి. అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ వివరాల మేరకు.. కాంతమ్మ అటవీప్రాంతంలో చిరుత పిల్లలను గమనించింది. అవి నీరు తాగి తిరిగి అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె భయపడింది. తన వైపు వస్తున్నట్లు భావించి రాయి విసిరింది. దీంతో అవి వెనుతిరిగి వచ్చి దాడి చేశాయి. చిరుత పిల్లలు గోళ్లతో రక్కాయి. దీంతో ఆమె పరిగెత్తుకుని గ్రామానికి చేరుకుంది. చిరుత కనిపిస్తే దాడులు చేయడానికి ప్రయత్నించ వద్దని డీఆర్వో సూచించారు. ఎవరికైన కనిపిస్తే తమకు తెలియజేయాలని కోరారు. ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎఫ్‌బీవోలు నిశ్చల్‌బాబు, లావణ్య, ఏనుగుల ట్రాకర్స్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ



మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ చేస్తోందని టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 17 నెలల్లో రూ.50,763 కోట్ల ఎన్టీయార్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగావృద్దులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, డయాలసిస్ పేషంట్లకు రూ.10 వేలు, దీర్ఘకాలికంగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ప్రతి నెల క్రమం తప్పకుండా ఇంటివద్దకే వెళ్ళి అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట ల్యాబ్ టెక్నీషియన్‌కు సేవా పురస్కారం



అవార్డు అందుకుటున్న పెంచలయ్య

వి.కోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వి.కోట సీహెచ్‌సీలో ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పెంచలయ్యకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి ఆయనకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించారు.డీఎల్ఏటీవో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెంచలయ్యకు అవార్డు రావడం పట్ల స్థానిక సీహెచ్‌సీ వైద్యులు మురళి, సల్మా, కిరణ్, అశ్విని, కల్పన ఆయన్ను అభినందించారు.వి.కోటలోనూ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

సమస్యలివిగో... స్పందించండి

● కలెక్టరేట్‌కు 232.. పోలీసుశాఖకు 31 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి కలెక్టర్ సుమిత్ కుమార్ వినతిపత్రాలను అందజేశారు. 232 అర్జీలు అందగా రెవెన్యూ, సర్వేశాఖలవే 166 కావడం విశేషం. కొన్ని సమస్యలను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని నిర్దీత సమయంలోగా పరిష్కరిస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు.

●అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు కోసం స్థలాన్ని కేటాయించాలని చౌడేపల్లె మండలం నునిముద్దలపల్లె గ్రామాలకు చెందిన. సుమారు 60 మంది కలెక్టర్‌ను కోరారు. ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్న 1.36 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇందుకు కేటాయించాలని అభ్యర్థించారు.

●మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండుకాళ్ల పడిపోవడంతో కుటుంబం గడవటం కష్టంగా ఉందని చిత్తూరు ఇరువారానికి చెందిన జయశంకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. భార్య, తల్లి, ఇద్దరు పిల్లలను పోషించలేకపోతున్నానని వాపోయాడు. "పింఛన్ కోసం. సదరం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేయాలని వెళితే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

●తమ ఇళ్లను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని పెద్ద పంజాణి మండలం బనకందొడ్డికి చెందిన గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 30 ఏళ్ల నుంచి నివాసాలుంటున్నామని చెప్పారు. ఈ భూమికి తనవద్ద పట్టా ఉందంటూ ఓ వ్యక్తి బెదిరిస్తున్నారని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

●దారి సమస్యను పరిష్కరించలాని ఐరాల మండలం గాజులపల్లె దళితులు కోరారు. 1983లో అధికారులు దారి కల్పించినా ఇటీవల ఓ వ్యక్తి అడ్డుతగులుతున్నారనిచెప్పారు. దారిసమస్యను పరిష్కరించాలని కోరారు.







చౌడేపల్లె మండలం నూనిముద్దలపల్లె గ్రామస్తులు, చిత్తూరు ఇరువారానికి చెందిన జయశంకర్, పెద్దపంజాణి మండలం బనకనదొడ్డి గ్రామస్తులు

● పోలీసుశాఖకు 31 వినతిపత్రాలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు 31 మంది నుంచి అర్జీలను ఎస్పీ తుషార్ డూడీ స్వీకరించారురు. అందులో దొంగతనం కింద 8, కుటుంబ తగాదాలు 7, ఆస్తి తగాదాలు 6, డబ్బు తగాదాలు 4, ఇంటి తగాదాలు 2, బైక్ దొంగతనం, చీటింగ్, వేధింపులు, దొంగతనానికి సంబంధించి ఒక్కో అర్జీవంతున 31 అర్జీలు అందాయి.

ఒంటరి ఏనుగు హల్‌చల్

● నాలుగు పంచాయతీల్లో పంటల ధ్వంసం



ఒంటరి ఏనుగు విరిచేసిన మామిడిచెట్టు కొమ్మలు

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి ఒంటరి ఏనుగు పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి ఆదివారం రాత్రి చేరుకొంది. నాలుగు పంచాయతీల్లో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు ఎలాంటి ప్రమాదం లేకుండా నాలుగు రోడ్లను దాటుకుంది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు జమిలిగుట్ట మార్గంలో పాళెం పంచాయతీలోకి చేరుకొని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. ఎలకమాను మార్గంలో కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకొని కొంగరవారిపల్లి, పూరేడువారిపల్లి, పాతపేట, గంటావారిపల్లి ప్రాంతాల్లో పలు పంటలను, రాతి కూశాలను ధ్వంసం చేసింది. అక్కడ నుంచి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని చేరుకుంది. సోమవారం పగలంతా అడవిలోని గోగులమ్మ వంక సమీపంలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

శ్రీకాళహస్తిలో 'అఖండ' త్రిశూలం



త్రిశూలంలో ఆలయంలో అఖండ బృందం

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):అఖండ తాండవం సినిమాలో హీరో ఉపయోగించిన త్రిశూలం, ఢమరుకంతో నందమూరి బాలకృష్ణ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు జగన్‌మోహన్ సోమవారం శ్రీకాళహస్తిలోని ముక్కంటీశుడిని దర్శించుకున్నారు. బాలకృష్ణ నటించిన ఈ చిత్రం 5న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. సినిమాలో కథానాయకుడు ఉపయోగించిన త్రిశూలం, ఢమరుకంతో పంచ శైవక్షేత్రాలను దర్శించే కార్యక్రమానికి జగన్‌మోహన్ బృందం సోమవారం శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం చుట్టింది. ముక్కంటి ఆలయం వద్ద ఈ బృందానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అఖండ2 విజయవంతం కావాలని శ్రీకాళహస్తి క్షేత్రాన్ని మొదట సందర్శించామని జగన్‌మోహన్ చెప్పారు. ఇక్కడి నుంచి కంచి, అరుణాచలం, జంబుకేశ్వరం, చిదంబరం క్షేత్రాలను దర్శించుకుంటామన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల విజేత చిత్తూరు





రన్నర్స్‌గా నిలిచిన చిత్తూరు బాలికల జట్టు, విన్నర్స్‌గా నిలిచిన చిత్తూరు బాలుర జట్టు

పలమనేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14 బాస్కెట్ బాల్ పోటీల్లో చిత్తూరు బాలుర జట్టు గెలుపొందింది. కడప జట్టుతో జరిగిన పోరులో చిత్తూరు పైచేయి సాధించింది. అదేవిధంగా బాలికల విభాగంలో కూడా చిత్తూరు, కడప జట్లు తలపడగా కడప జట్టు గెలుపొందగా చిత్తూరు బాలికల జట్టు రెండవ స్థానంలో నిలిచింది.

అఖండ-2 విజయంకోసం పూజలు



బాలకృష్ణ అభిమానులతో ఎమ్మెల్యే, చైర్మన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హీరో బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమా విజయం సాధించాలని కోరుకుంటూ కాణిపాక వరసిద్ధుని ఆలయంలో అనంతపురానికి చెందిన బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. బాలకృష్ణ సినిమాలో వాడిన త్రిశూలం, ఢమరుకాన్ని ఆలయానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే మురళీమోహన్,ఆలయ చైర్మన్ మణినాయుడు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐదేళ్లలో ఎయిడ్స్ రహితం కావాలి





ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ, గాంధీ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ

చిత్తూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కలిసికట్టుగా కృషి చేద్దామని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకొని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అధికారులతో కలిసి అపోలో నర్సింగ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చిత్తూరు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలూ సమన్వయంతో హెచ్ఐవీ నివారణకు కృషి చేయాలన్నారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామన్నారు.హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమన్నారు.జిల్లాలో ప్రస్తుతం 4169 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. గతంలో పోలిస్తే జిల్లాలో ఎయిడ్స్ వ్యాప్తి చాలా వరకు తగ్గిందన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించి జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. చుడా చైర్‌పర్సన్ హేమలత, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, అపోలో నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి పెయింటర్ దుర్మరణం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బస్సు టైరు కింద పడి ఓ పెయింటర్ దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం చెన్నమ్మగుడిపల్లెకు చెందిన వినోద్(30) పెయింటర్ పనిచేస్తున్నాడు. సోమవారం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ సమీపంలోని రెడ్డిగుంట సర్వీసు రోడ్డులో వినోద్ ద్విచక్రవాహనంపై చిత్తూరు వైపుగా వస్తున్నాడు. అదే సమయంలో ఓ ప్రైవేటు బస్సు ఓవర్ టేక్ చేస్తుండగా అతను అదుపు తప్పి బస్సు వెనక టైరు కింద పడిపోయాడు. తలపై ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ టికెట్ల కొనుగోలుకు భక్తుల పాట్లు


● తిరుమలలో పనిచేయని పేమెంట్ గేట్‌వే, మాన్యువల్‌గా కేటాయింపు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల కొనుగోలుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా అదనపు ఈవో కార్యాలయంలో సిఫార్సు లేఖలు సమర్పించిన అనంతరం కేటాయింపు మెసెజ్ భక్తుల సెల్‌ఫోన్‌కు వస్తుంది. మెసేజ్‌లోని లింక్ ఆధారంగా పేమెంట్ చేస్తే టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. అయితే టీటీడీ నుంచి నిర్ధారణ మెసేజ్‌లు భక్తులకు చేరినప్పటికీ పేమెంట్ చేయడంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో భక్తులు టికెట్లు ఎలా పొందాలో తెలియక కంగారు పడ్డారు. అయితే టెన్షన్ పడాల్సిన అవసరం లేదని, ఎంబీసీ34లోని కౌంటర్ల ద్వారా మాన్యువల్‌గా పొందవచ్చని సూచన చేశారు. దీంతో భక్తులు వర్షంలోనే ఇబ్బంది పడుతూ క్యూలైన్ల ద్వారా టికెట్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతోనే నగదు చెల్లింపులలో ఇబ్బందులు ఎదురయ్యాయని అధికారులు తెలిపారు.

ఏం జరిగిందో.. ఏమో?

● దామినేడులో ముగ్గురి అనుమానాస్పద మృతి

● ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన





మనీష్, పూన్‌గొట్టాయి (ఫైల్‌ఫొటోలు)

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆమెకు వివాహమైంది. మగబిడ్డ ఉన్నాడు. ఆ బిడ్డతో ప్రియుడి వద్దకు వచ్చేసింది. ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడులో ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో గానీ.. అతడు ఫ్యానుకు వేలాడుతూ.. ఆమె, బిడ్డ బాత్‌రూమ్‌లో విగతజీవులుగా పడుండటం సోమవారం వెలుగు చూసింది. ఆ గది తలుపునకు లోన గడియ పెట్టిఉండగా బయట తాళం వేసి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్ఐ అరుణ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాత్తానికి చెందిన సత్యరాజ్(36), పూన్‌గొట్టాయి(21) ఇష్టపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆమెకు వేరే వ్యక్తితో పెళ్లయింది. కుమారుడు మనీష్(3) ఉన్నాడు. ఆరు నెలల కిందట భర్తను వదలి ఆమె బిడ్డతో కలిసి సత్యరాజ్ వద్దకు వచ్చింది. ఈ ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడు హౌసింగ్‌కాలనీలో అద్దెకు ఉంటూ కూలి పనులు చేసుకునేవారు. వారం కిందట తిరుపతిలోని తమ సమీప బంధువుతో మాట్లాడారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో సోమవారం వారి బంధువులు ఇంటికి వచ్చారు. లోపల నుంచి దుర్వాసన వస్తోంది. బయట తాళం వేసి ఉంది. అనుమానం వచ్చి తిరుచానూరు పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ అరుణ, సిబ్బంది అక్కడికి వెళ్లారు. లోపల తలుపునకు గడియ పెట్టి ఉంది. తలుపు పగులగొట్టి లోపలకు వెళ్లగా సీలింగ్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని సత్యరాజ్.. పక్కనే బాత్‌రూమ్‌లో పూన్‌గొట్టాయి, మూడేళ్ల మనీష్ విగతజీవులుగా పడున్నారు. వారం కిందట మృతి చెందినట్లు భావిస్తున్నారు. అనుమానాస్పద రీతిలో మృతిగా కేసు నమోదు చేసి మూడు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. ముగ్గురూ కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారా లేదా తల్లీ బిడ్డకు విషమిచ్చి సత్యరాజ్ ఉరేసుకున్నాడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. లోపల గడియ వేసి ఉండటం.. బయట తాళం వేసి ఉండటంతో మరో కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



తహసీల్దారు చిట్టిబాబుకు సూచనలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపొద్దని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులతో అన్నారు. కుప్పం మండల పరిషత్తు సమావేశపు హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి కడా పీడీ వికాస్ మర్మత్ వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కుప్పంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కావడంతో ఇక్కడ అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలన్నారు. గడువులోగా సంబంధిత సమస్యను పరిష్కరించి తనకు నివేదించాలని సూచించారు. పరిష్కరించలేకపోవడానికి కారణం పేర్కొంటూ తనకు సరైన వివరణ సమర్పించాన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మునేశ్వరస్వామి గోపుర ప్రతిష్ఠ



కుప్పంలో అయ్యప్పస్వామికి మొక్కుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం మర్రిమాను వీధిలో వెలసిన శ్రీ మునేశ్వర స్వామివారి దేవాలయ గోపుర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా, పవిత్రంగా జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం తరఫున ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొత్తపేటలో వెలసిన మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయప్పస్వామి ఉత్సవ మహాయాగానికి ఆయన హాజరయ్యారు. అయ్యప్ప స్వాముల పూజల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక కైంకర్యాలు సమర్పించారు.

'ఆయుష్' తీసుకురావడం శుభపరిణామం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఆయూబ్‌ఖాన్

పుంగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన, చట్టబద్ధమైన ఆయుష్ వైద్యవిధానాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీసుకురావడం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.ఆయూబ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆయుష్ వైద్యవిధానాన్ని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కిందకు తీసుకొచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రులు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండేటట్లు చేయడం, 70 శాతం పడకలు పేదవారికి కేటాయించడం, పూర్తి ఉచితంగా ఔట్‌పేషెంట్ సేవలు అందించడం ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం అభినందనీయమన్నారు. మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా ఉచిత సేవలు అందించేలా మంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు, నాయకులు నాగరాజు, అమరనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం



వృద్ధులకు చేతికర్రలను అందజేస్తున్న తహసీల్దార్ మధుసూదన్

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కింద ప్రజల నుంచి అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ మధుసూదన్ తెలియజేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పలువురు వినతులు అందజేశారు. వల్లిగట్ల, ఇరికిపెంట, చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో అటవీశాఖకు, రెవెన్యూ శాఖ పరిధిలోని పలు భూములు వివాదంలో ఉన్నాయని సంయుక్త సర్వేతో వాటిని పరిష్కరించాలని కోరారు. బసవపల్లె, వల్లిగట్ల పంచాయతీలో శ్మశానాల భూములు కబ్జా అయ్యాయని అర్జీలు అందజేశారు. ఈక్రమంలో పలువురు వృద్ధులకు తహసీల్దార్ చేతికర్రలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ సర్పంచి హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, బాలకృష్ణ, అర్జీదారులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

శాంతిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్లెలను ప్రగతి బాటలో నడపడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడదిన్నేపల్లె దళిత కాలనీకి నూతనంగా మంజూరైన సీసీ రోడ్డుకు పంచాయతీ టీడీపీ నేతలతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జి రమేశ్‌రెడ్డి, రేగడదిన్నేపల్లె పంచాయతీ టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర డైరెక్టర్లు



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసిన రాష్ట్ర డైరెక్టర్లు

శాంతిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను శాంతిపురం మండలానికి చెందిన రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథనాయుడు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, శాంతిపురం సింగల్ విండో చైర్మన్ గోపాల్ సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిపురం మండలంలోని దినసరి కూలీ కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని, అలాగే ఇతర సహాయ సహకారాలు అందించాలని కోరామని తెలిపారు.

రోడ్డంతా బురదమయం!



బురదమయమైన సదుం-నాయనపాకాల రోడ్డు

సదుం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సదుం-నాయన పాకాల రోడ్డుపై గుంతలు పూడ్చే క్రమంలో రోడ్డంతా బురదమయమై మరింత అధ్వానంగా మారింది. ఇటీవల స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో వికలాంగ, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాల గుర్తింపు శిబిరం జరిగింది. ఆరు మండలాల నుంచి శిబిరానికి హాజరయ్యే ప్రజలు ఇదే రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంది. దీంతో స్థానిక పంచాయతీ సిబ్బంది రోడ్డుపై అటు ఇటు ఎత్తు పల్లాలుగా ఉన్న మట్టితోనే ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుపై గుంతలను పూడ్చి చేతులు దులుపుకున్నారు. కాగా దిత్వా తుఫాను ప్రభావం కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో రోడ్డంతా బురదమయంగా తయారై కాలు మోపేందుకు వీలుకాని దుస్థితిలో రోడ్డు దర్శనమిస్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలతోపాటు ప్రధానంగా ఆసుపత్రికి రోగులు ఇదే దారిన వెళ్లాల్సి ఉంది. ఏళ్ల తరబడి కనీసం మరమ్మతులు కలే అడుగడుగునా గోతుల మయమై రోడ్డుకు ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోజంతా జడివాన..!

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో దిత్వా తుఫాను ఎఫెక్ట్ బాగా తగిలింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు రోజంతా జడివాన కురిసింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో ప్రజలు చలికి వనికిపోయారు. వృద్ధులు, చిన్నారుల సైతం ఇళ్లకే పరిమితమయ్యారు. గ్రామాల్లో పశువులు మేతకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డాయి. వాన తగ్గినట్టే తగ్గుతూ మళ్లీ జోరు పెంచుతుండటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు, కూలీలు సాహసించలేదు. ప్రజలు అత్యవసర పనులకు గొడుగులతో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. అయితే రెండు రోజులుగా వర్షం పడుతున్నా వంకలు సాగే వాన పడకపోవడం కొసమెరుపు.

క్రీడలతో మానసికోల్లాసం



సోమలలో క్రీడాపోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈవోలు విజయకుమారి, శివరత్న తెలిపారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ముఖ్యమన్నారు. త్రోబాల్ పోటీలు నిర్వహించి మండల టీమ్‌లు ఎంపిక చేశారు. డివిజన్ స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హేమసుధాకర్, కుసుమాంబ, పీడీలు శివకుమార్, కరుణానిధి, శ్రీనివాస్, హారతి, జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.12 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణం



నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు

సదుం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపల్లెలో వెలసి ఉన్న శ్రీవారి పాద క్షేత్రం ఆలయ భక్తులు సౌకర్యార్థం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో రూ.12 లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించారు. మహిళలకు ప్రత్యేకంగా నాలుగు, పురుషులకు నాలుగు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించినట్లు డీఈ కిశోర్ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులే ఆరోగ్యకరమని తహసీల్దార్ మధుసూదన్ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గోడపత్రికలను ఆవిష్కరించారు. సూపర్ వైజర్ హరిత మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడిన పంటలను తినడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల వద్దనే పెరటి తోటల్లో పండించిన ఆకుకూరలే వడ్డించడం జరుగుతుందన్నారు. సీడీపీవో రాజేశ్వరి, టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఆర్ఐ సుబుక్తుల్లా, హరిప్రసాద్, రమేశ్‌నాయుడు, బాలకృష్ణ, గురుస్వామి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం కరకమంద బస్టాండు, చెన్నమల్లయ్యతాత ఆలయం వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ఇంటింటా పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య సంరక్షణ కరపత్రాలను అందజేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, సర్పంచి కర్రి వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్పభక్తులకు అన్నదానం

పుంగనూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దాత జయరాం, కుటుంబీకులు అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 350 మంది అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని తహసీల్దార్ రాము తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మానిటరింగ్ కమిటీ సమావేశానికి దళిత సంఘ నాయకులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం







కుప్పం మున్సిపాలిటీలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న రాజ్ కుమార్, కల్లూరు: వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి, శాంతిపురం: కొలమడుగులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని కడా వీపీసీ సభ్యుడు రాజ్‌కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పాతపేటలో రాజ్‌కుమార్, కుప్పం మండలం మల్లానూరులో ప్రేమ్ కుమార్‌లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం ఒకపక్క, అభివృద్ధి మరోపక్క రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

● సోమల: ఇరికిపెంట పంచాయతీలోని గ్రామాల్లో సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, కార్యదర్శి మేనక, కోటీశ్వరరావు, భానుప్రకాశ్ నాయుడు, మధనిక తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: ప్రతినెలా ఒకటో తేదీ వస్తే రాష్ట్రంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పండుగలాంటిదని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం 102 ఈ రామిరెడ్డిగారిపల్లిలో సోమవారం ఆయన పింఛన్ల పంపిణీ అందజేశారు. ఎంపీడీవో రాజశేఖర్ బాబు, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, మహేష్, లోకేష్, రమేష్, నజీర్, సుబ్రహ్మణ్యం నాయుడు, సురేంద్ర, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రామకుప్పం మండలం అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు.

● శాంతిపురం: ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పమని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొలమడుగు, వి.కొత్తూరు, సిద్దారెడ్లపల్లె, రేగడదిన్నేపల్లె, శివరామపురం గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మెరసనపల్లె గ్రామంలో చెంగప్పకు నూతనంగా మంజూరైన రూ.10 వేలు పెన్షన్‌ను ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు, గ్రామ పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేశారు.



సోమల : ఇరికిపెంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

● సదుం: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం 96 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. అందుబాటులో లేని మిగిలిని నాలుగు శాతం లబ్ధిదారులకు రెండు, మూడు తేదీల్లో పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సచివాలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

పుంగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రాంతంలో ఇటీవల గ్రామ సచివాలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 9వ తేదీ పుంగనూరు మండలం సుగాలిమిట్ట, మేలుందొడ్డి, సింగిరిగుంట సచివాలయాలతోపాటు స్థానిక ప్రభుత్వ మైనారిటీ ఐటీఐలో టీవీలు, బ్యాటరీలు, కంప్యూటర్ల చోరీ జరిగినట్లు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం మండలంలోని వనమలదిన్నె క్రాస్‌లో అనుమానంగా తిరుగుతున్న కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా మురగమల్లాకు చెందిన బషీరుల్లా కుమారుడు పఠాన్ హమీద్‌ఖాన్(38), బెంగళూరులోని కేజీహళ్లి ప్రాంతానికి చెందిన సలీంబాషా కుమారుడు షాదిక్‌బాషా(38), రసీద్‌నగర్‌కు చెందిన మజాద్‌అహ్మద్ కుమారుడు షాద్బా అహ్మద్(36)లను అదుపులోకి తీసుకుని విచారించగా తాము దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో వారి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మండల పరిధిలో ఇటీవల సచివాలయాల్లో చోరీలు చేసినట్లు అంగీకరించారన్నారు. తమతో పాటు మురగమల్లాకు చెందిన షాజహాన్‌బాషా చోరీల్లో ఉన్నట్లు తెలిపారన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన వివరించారు. నిందితుడు హమీద్‌ఖాన్ పట్టణ సమీపంలోని నక్కబండ ప్రాంతంలో వివాహం చేసుకోవడంతో తన స్నేహితులను పిలుపించుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెలుగు చూసిందన్నారు. ముగ్గురు నిందితులను పట్టుకోవడంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఎల్లప్ప, రెడ్డెప్ప రాజా, అల్లావుద్దీన్‌లు సహాయ సహకారాలు అందించడంతో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ వారిని అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే సీఎం ధ్యేయం



మెగా రక్తపరీక్ష శిబిరం ప్రారంభోత్సవంలో నేతలు

రామకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం రామకుప్పం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం, గ్రామ సచివాలయాల్లో సంజీవని పథకంలో భాగంగా యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ మెగా రక్తపరీక్ష శిబిరాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధుల బారిన పడి చికిత్సల కోసం పరుగులు తీసే బదులు, పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారి నుంచి రక్షింపబడొచ్చన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రథమంగా రక్తపరీక్ష శిబిరాలను కుప్పం నియోజకవర్గంలోనే శ్రీకారం చుట్టారన్నారు. సోమవారం నిర్వహించిన శిబిరాల్లో వైద్య సిబ్బంది 84 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, మైనారిటీసెల్, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు సలాంసాబ్, అవినాశ్‌రెడ్డి, మైనారిటీసెల్ మండల అధ్యక్షుడు ఆదిల్, జనసేన మండలాధ్యక్షుడు హరీష్, నేతలు రామకృష్ణప్ప, విజయ్‌కుమార్‌రెడ్డి, నియాజ్, బాలరాజు, టీవీరవి, సుబ్రీ, అమరనాథ్, నరసింహ, మంజునాథ్, మురళీ, పద్మమ్మ, బాలకృష్ణ, అల్లీశీన తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలకు జనసేన నేతల పాలాభిషేకం



వినతులు తీసుకుంటున్న జనసేన నేతలు

పుంగనూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు కానున్న మదనపల్లె జిల్లా లో పుంగనూరును చేర్చినందుకు జనసేన పార్టీ నాయకులు సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన నాయకుడు కోలా సోమశేఖర్, పార్టీ ఇన్‌చార్జి చిన్నారాయల్, సింగల్‌విండో అధ్యక్షుడు పగడాల రమణ జనవాణి కార్యక్రమంలో వచ్చిన నాలుగు వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు మదనపల్లె జిల్లాతోబాటు పుంగనూరును మదనపల్లెలో కలపడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రతి సోమవారం జరిగే జనవాణిలో సమస్యలు తెలియజేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యాసంస్థల బస్సుల తనిఖీలు

గంగవరం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వివిధ ప్రయివేటు విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులను జిల్లా ట్రాన్స్‌పోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి భూషన్‌రెడ్డి, పలమనేరు ఎంవీఐ మధుసూదన్‌లు సోమవారం తనిఖీ చేశారు. నవరించిన వాహన నిబంధనల మేరకు బస్సుల ఫిట్‌నెస్‌పాటు డ్రయివర్ల లైసెన్సులు, బస్సుల్లో అత్యవసర ద్వారం ఏర్పాటు చేశారా, పనిచేస్తుందా, అగ్నిప్రమాదం జరిగితే మంటలను ఆర్పేందుకు చేయాల్సిన అగ్నిమాపక పరికరాలను ఏర్పాటుచేశారా లేదా లాంటి అంశాలను పరిశీలించారు. బస్సుల డ్రయివర్లకు వాహన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు శిక్ష

రొంపిచెర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో సదుం మండలం బూరగమందకు చెందిన పి.చిన్నబ్బ కుమారుడు పి.వెంకటరమణ (46), మల్లెల నరసింహులు కుమారుడు ఎం. హరినాథ్ (45)లకు 5 ఏళ్ల జైలు, రూ.6 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

పింఛన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీకి ప్రథమస్థానం

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీలో కుప్పం పురపాలక సంఘం జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించింది. డిసెంబరు 1వ తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 5357 పింఛన్లుండగా, ఏకంగా 5099 పింఛన్లు పంపిణీ చేసి 95.18 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేకాదు, ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోని శాంతిపురం, కుప్పం మండలాలు పింఛన్ల పంపిణీలో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. శాంతిపురం మండలంలో 8,613 పింఛన్లుండగా 8,166 పింఛన్లు పంపిణీ చేసి 94.81 శాతంతో ద్వితీయ స్థానం సాధించింది. అలాగే కుప్పం మండల పరిధిలో 9,763 పింఛన్లుండగా 9167 పింఛన్లు పంపిణీ చేసి 93.9 శాతంతో తృతీయ స్థానం పొందింది. పాలసముద్రం మండలం 86.64 శాతం మాత్రమే పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలోనే ఆఖరు స్థానంలో నిలిచింది.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

పుంగనూరు రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ముడిపాపనపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్భంగా అడవినాథకుంటలో విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన వ్యక్తులకు తెల్ల రక్తకణాలు క్షీణించడం, బరువు తగ్గడం, తరచూ జ్వరం రావడంతో మనిషి ఆనార్యోగానికి గురవుతారని వివరించారు. ఎయిడ్స్ శారీక సంబంధాలతోనే కాకుండా రక్తమార్పిడి, ఒకరికి వాడిన సిరింజిలు మళ్లీ వాడకం వల్ల, సేవింగ్‌బ్లేడ్‌లు వల్ల ఎయిడ్స్ వ్యాప్తి చెందే అవకాశాలు అధికంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమా, ఎంపీహెచ్‌వోలు మురళీబాబు, హరిప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ , జనచేతన శ్రావణి, అనీల్‌కుమార్, సోమరాజు, సాహిదాబేగం తదితరులు పాల్గొన్నారు. పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు.

గోతులు పూడ్చాలి: సీపీఐ

పుంగనూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నుంచి రామసముద్రం వెళ్లే రోడ్డు గోతులు పూడ్చాలని కోరుతూ సీపీఐ నాయకులు వెంకట్రమణారెడ్డి, రామ్మూర్తి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అధ్వానంగా స్థానిక రామసముద్రం రోడ్డులో ప్లేకార్డులు పట్టుకుని రోడ్డు బాగుచేయాలంటూ నినాదాలు చేశారు.

గడ్డూరులో పారిశుధ్య పనులు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పలమనేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపులో భాగంగా సోమవారం గడ్డూరు గ్రామంలో సహజ వనరుల వినియోగం, సంరక్షణ, సుస్థిర అభివృద్ధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. కుప్పం డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ చిదంబరం, ఎన్ఎస్ఎస్ క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ టి. బాలాజీ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదాస జయంతోత్సవానికి ఆహ్వానం



మంత్రి సవితమ్మకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కురబ సంఘం నేతలు

వి.కోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వి.కోటలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సవితకు మండల కురబ సంఘం అధ్యక్షులు ఎం.సీ.కృష్ణప్ప, మాజీ అధ్యక్షులు బలరాం, బైరెడ్డిపల్లె అధ్యక్షులు శివకుమార్‌లు ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, పీఎంకే ఉడా చైర్మన్ డా.సురేస్‌బాబు, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, మండల టీడీపీ అధ్యక్షులు రాంబాబులను కూడా ఆహ్వానించారు. వారి వెంట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడు, రెస్కో మాజీ డైరెక్టర్ గంట్లప్ప, నేతలు మూర్తి, గౌరప్ప, మాధవ, పరందామ, కుమార్, బాబు తదితరులు ఉన్నారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం



వెదురుకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో జ్ఞాన మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు. కన్నికాపురం సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త అరుణమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చవట గుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు.పరిసర గ్రామాల భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.కార్వేటినగరం సమీపంలోని సదాశివేశ్వ రస్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. అన్నదానం చేశారు.

కార్యకర్త మృతికి టీడీపీనేతల నివాళి



గోవిందస్వామి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేపంజేరి దళితవాడకు చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త గోవిందస్వామి (52) అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని పలువురు టీడీపీ నాయకుల, కార్యకర్తలతో కలిసి పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, ముప్పిరి మోహన్‌నాయుడు, స్వామిదాస్‌లు తదితరులు వెళ్లి మృతేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వేగంగా వినతుల పరిష్కారం



అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):పీజీఆర్ఎస్‌లో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంకు 2, హెల్త్‌కు 2, టిడ్కోకు 2 చొప్పున ఆరు అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి



సెక్రటరీలకు వీడ్కోలు పలుకుతున్న ఎంపీడీవో

పెనుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నలుగురు గ్రేడ్-1 సెక్రటరీలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా(జీఎస్‌డబ్ల్యూఎస్) పదోన్నతి లభించింది. పెనుమూరు సెక్రటరీ ప్రభుకిరణ్ తవణంపల్లి మండలానికి, కేసీపల్లి సెక్రటరీ ప్రసన్నకుమార్ నారాయణవణం మండలానికి, గుంటిపల్లి సెక్రటరీ మురళి గుడిపాల మండలానికి, కలవగుంట సెక్రటరీ గౌస్‌వల్లీఖాన్ వడమాలపేట మండలానికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతిపై వెళ్లనున్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ అనంతరం ఈ నలుగురూ రిలీవ్ అయ్యారు. వీరికి ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏవో కిషోర్, సీనియర్ అసిస్టెంట్ కరుణాకరణ్, సిబ్బంది వీడ్కోలు పలికారు.

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా



గుండుపల్లెలో పెన్షన్ అందిస్తున్న మోహన్‌మురళి

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్‌లతోనే పేదవర్గాలకు ఆర్థికభరోసా లభిస్తున్నట్లు పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు.ముక్కళత్తూరు పంచాయతీ మిట్టదళితవాడలో సోమవారం టీడీపీ నేతలతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, ముప్పిరి మోహన్‌నాయుడు, స్వామిదాస్, కామసాని కోదండరెడ్డి, ఇమ్మాన్యేల్ పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** పచ్చికాపల్లం పంచాయతీ గుట్ట మీదఇండ్లులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న పంపిణీ చేశారు. వెదురుకుప్పం, మొండివెంగన పల్లె గ్రామ పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పి.మోహన్‌మురళి, ఎర్రగుంటలో కోనేరు చెంగల్రాయరెడ్డి, కార్వేటినగరంలో మేళం రవియాదవ్, జగన్నాథం పెన్షన్లను పంపిణీ చేశారు. **విజయపురం:** మండలంలో టీడీపీ నాయకుడు రమేష్‌రాజు, విజయపురంలో చుక్కాధనుంజయయాదవ్, మహారాజపురంలో బాలసుబ్రహ్మణ్యంరాజు, కోసలనగరంలో బాబుయాదవ్, ఇళ్ళత్తూరులో మునిభాస్కర్‌రాజు, కేవీపురంలో బాబునాయుడు పింఛన్లను పంపిణీ చేశారు.


భగవద్గీత జీవన మార్గదర్శి



మాట్లాడుతున్న కల్యాణి, వేదికపై జగన్మోహన్ తదితరులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి: జీవవ మార్గ నిర్దేశిని భగవద్గీత అని ఎమ్మెల్యే గురజాల జగన్మోన్ పేర్కొన్నారు. సోమవారం కట్టమంచి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాంప్రసాద్ నిర్వహించనున్న భగవద్గీత ప్రవచన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఆధ్యాత్మికంగానే కాకుండా మానవుని దైనందిన జీవితంలో నిర్వహించాల్సిన విది విధానాలకు మార్గం చూపుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు కల్యాణి మాట్లాడారు. 15 మంది అర్చకులను ఎమ్మెల్యే సత్కరించారు. మేయర్ అముద, కార్పోరేటర్ హరిణి రెడ్డి,దేవదాయశాఖ ఈవోలు వెంకటరాయలు, సుబ్రమణ్యం నాయుడు, బ్రహ్మ కుమారీస్ నిర్వాహకులు హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పడి పూజ



ఇరుముడుల కార్యక్రమంలో భక్తులు

గుడిపాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప భక్తులు పడిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని, అయ్యప్ప,సుబ్రహ్మణ్యం స్వామిని అరటి పట్టలతో గుడిని ఏర్పాటు చేసి పడి పూజ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప నామ స్మరణతో భక్తులు మార్మోగించారు. చుట్టుపక్కల గ్రామస్తులు వీరికి అన్న ప్రసాదాన్ని అందజేశారు.**ఐరాల:** నాగమవాండ్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన అయ్యప్ప భక్తులు సోమవారం మఠంపల్లెమిట్టలోని వీరభద్రస్వామి ఆలయం వద్ద ఇరుముడులను భక్తిశ్రద్ధలతో కట్టుకున్నారు. 25 మంది భక్తులు నలభై రోజులు దీక్షలు చేసి ఇరుముడులను కట్టుకున్నారు

పూరి గుడెసెకు నిప్పు

● గుర్తు తెలియని వ్యక్తుల ఆగడం



బీరువాలో దగ్ధమైన దుస్తులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పూరిగుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన వైనమిది. బాధితురాలి కథనం మేరకు డి.కె. మర్రిపల్లెలోని అంబేద్కర్ కాలనీ చెందిన శోభ(32) పూరిగుడిసెలో ఒంటరిగా ఉంటోంది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూరిగుడెసెకు నిప్పు పెట్టారు. నిత్యావసర సరుకులు, బీరువాలోని రూ. 30వేల నగదు కాలిపోయాయి. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, బాధితురాలిని ఆదుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

13న లోక్ అదాలత్

నగరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరి మాస్టర్ కోర్టులో ఈనెల 13న లోక్ అదాలత్ జరగనుంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగరి ఇన్‌చార్జి న్యాయమూర్తి రమ్యసాయి సూచించారు. ఈ ఆదాలత్‌తో వీలైనమేర కేసుల రాజీకి అన్ని శాఖల వారు ప్రయత్నించాలన్నారు.

6న అర్చకుల సమావేశం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అమలు అవుతున్న ధూపదీప నైవేద్యాల పథకం అమలు ప్రగతిపై అర్చకులతో ఈ నెల 6న పొన్నియమ్మ గుడి వీరాంజనేయ స్వామి ఆలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే అర్చక స్వాములు తమ ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, అర్చకత్వ నిర్వహిస్తున్న ఆలయ మూలవర్లతో కూడిన ఫోటోలు, ఈవో, ఇన్‌స్పెక్టర్, వీఆర్వోల సర్టిఫికెట్‌వెంట తీసుకురావాలని సూచించారు. హజరుకాని వారిపై దేవదాయ శాఖ అదికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతల స్వీకారం



ఎంపీడీవోకు జాయినింగ్ ఆర్డర్ సమర్పిస్తున్న రాజేష్

ఐరాల, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): మండల గ్రామ సచివాలయ డిప్యూటీ ఎంపీడీవోగా రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీఎన్.కండ్రిగలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతిపై ఐరాలకు వచ్చారు. ఈ మేరకు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డికి జాయినింగ్ ఆర్డర్స్ అందజేసి బాధ్యతలు స్వీకరించారు.

ఆటోను ఢీకొన్న కారు ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

వెదురుకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొనడంతో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఎస్ఆర్ పురం మండలం యల్లంపల్లికి చెందిన సిద్ధమ్మ కుటుంబీకులు సోమవారం ఓ ఆటోలో తిరుపతికి బయలుదేరారు. తంగేలి మిట్ట సమీపంలోని మధ్యలవంక వద్ద ఆటోను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బాగా దెబ్బతింది. ఆటోలో ప్రయాణిస్తున్న సిద్ధమ తీవ్రంగా గాయపడింది. సుశీల, మోహన్, మరో ఇద్దరు పిల్లలు, ఆటో డ్రైవర్ వెంకటేష్ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన సిద్ధమ్మను 108 వాహనంలో తిరుపతి తరలించారు.

నోటు పుస్తకాల పంపిణీ

పాలసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం.థామస్ దాత మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్ళూరిశివానాయుడుతో కలసి బ్యాగులే,నోటు పుస్తకాలు,ప్యాడ్లు,పెన్నులు, జామెట్రి బాక్సులను అందజేశారు. సుమారు 40 వేల రూపాయల విలువ చేసే విద్యా సామగ్రి సమకూర్చిన దాతను అభినందించారు.

కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్రప్రసాద్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సాంబశివన్, పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, నవీన్‌చౌదరి పాల్గొన్నారు.

నగర రహదారులకు మంచి రోజులు







కలెక్టర్ బంగ్లా వద్ద వెడల్పు చేసిన రోడ్డు- రూపుమారనున్న మైదా ఫ్యాక్టరీ సమీప రోడ్డు- సంతపేట రోడ్డులో ఇరువైపులా కాలువల నిర్మాణం

చిత్తూరు అర్బన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యల నుంచి నగర ప్రజలకు ప్రభుత్వం ఊరట ఇవ్వనుంది. నాలుగు రోడ్ల అభివృద్ధి, విస్తరణకు రూ.57.73 కోట్లను కేటాయించింది. ఇప్పటికే రూ.11.43 కోట్లను ఖర్చు చేసింది. కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ వరకు ఛిద్రమైన రోడ్డును అభివృద్ధికి ఎంపీ లాడ్స్, ఆర్థిక సంఘం, కలెక్టర్, మున్సిపాలిటీ నిధులు.. కలిపి రూ.25 కోట్లను కేటాయించారు. ఇక్కడ రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపులా డ్రైయిన్లు, సెంటర్ లైటింగ్ సిస్టమ్, డివైడర్‌లను ఏర్పాటుచేయనున్నారు. ఇటీవల శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్లతో తొలి విడత పనులు ప్రారంభమయ్యాయి.

రూ.25 కోట్లతో పలమనేరు రోడ్డు అభివృద్ధి

దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు ఉన్న పలమనేరు రోడ్డును అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంటర్ లైటింగ్ సిస్టమ్, డ్రైనేజీ వంటి పనులకు శంకుస్థాపన జరిగింది. మొదటి విడతగా రూ.4 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి.

కోర్టు డౌన్ నుంచి కాణిపాకం సర్కిల్ వరకు రోడ్డు విస్తరణతో పాటు అభివృద్ధికి రూ.4 కోట్లను కేటాయించగా, ఇప్పటికే రూ.70 లక్షలతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. కలెక్టర్ బంగ్లా వద్ద రోడ్డు విస్తరణకు రూ.73 లక్షలు కేటాయించారు. ఎమ్మెల్యే గురజాల, కలెక్టర్ చొరవ తీసుకుని 740 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు మేర బంగ్లా ప్రహరీని తొలగించారు. .అంబేద్కర్ భవన్ నుంచి వేలూరు రోడ్డు వరకు ఉన్న ఫారెస్టు రోడ్డును డబుల్‌గా మార్చారు.

ఎన్నికల హామీకి కార్యరూపం

రహదారుల అభివృద్ధి గురించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే గురజాల నిలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే నాలుగు వైపులా రోడ్లను అభివృద్ధి చేస్తుండగా.. హైరోడ్డు విస్తరణపై కూడా ఆయన దృష్టి సారించారు. దీనిపై పలుమార్లు భవన యజమానులు, వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. వెంకుశ కళ్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు, ఎంఎస్ఆర్ సర్కిల్ నుంచి ఇరువారం వరకు, గాంధీ సర్కిల్ నుంచి ఎస్టేట్ వరకు, కోర్టు డౌన్ నుంచి కాణిపాకం జంక్షన్ వరకు.. రోడ్ల వెడల్పును చేపట్టాలని నిర్ణయించారు.

ఒకటో తేదీ వస్తే.... అవ్వా తాతల్లో ఆనందం







పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్-జంగాలపల్లెలో మురళీమోహన్ - పాలసముద్రంలో థామస్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీవస్తే అవ్వా తాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే 20వ వార్డులోని కాజూరులో ప్రజా ప్రతినిధులతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ సొమ్మును తీసుకున్న లబ్దిదారులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారు.కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఏసీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, త్యాగరాజన్, కాజూరు బాలాజీ, కార్పొరేటర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు. **యాదమరి:** జంగాలపల్లెలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ 259 మంది లబ్దిదారులకు వృద్ధాప్య పింఛన్లను అందజేశారు. ఈసందర్భంగాఈఈ ఆయన మాట్లాడుతూ పింఛన్లకు పేటెంట్ హక్కు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. టీడీపీ నాయకులు మొరార్జీ యాదవ్, వెంకటేష్ రబీ,మణి నాయుడు, చిత్రనాయుడు, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వీరేంద్ర, వినాయకం గౌండర్, రాజమాణిక్యం,తదితరులు పాల్గొన్నారు. **నింద్ర:** చవరంబాకం పంచాయతీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికి త్వరలో కొత్త పెన్షన్లు అందజేస్తామన్నారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, లోకనాథం నాయుడు, జగన్, నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం.థామస్ పంపిణీ చేశారు. పాలసముద్రం కాలనీలో సీసీ రోడ్డు, మురికినీటి కాలువ, ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీసీ రోడ్డు, శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో అయ్యప్పరాజుకండ్రిగ సీసీ రోడ్డుకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. పాలసముద్రం కాలనీలో పీజీఎస్ఆర్ నిర్వహించి. అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యేను పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్ళూరిశివానాయుడు, సాంబశివన్, అరుళ్‌నాథన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పారిశుధ్య లోపం లేకుండా చూడండి



డార్మెటరీని పరిశీలిస్తున్న పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని ఈవో పెంచలకిషోర్ అన్నారు. సోమవారం ఆయన బస్టాండ్, ఉచిత డార్మెటరీ హాల్‌లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, అయ్యప్ప స్వాముల రద్దీ ఎక్కువగా ఉండటం నేపథ్యంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. డార్మెటరీలో సౌకర్యాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వారితో సౌకర్యాలపై ఆరా తీశారు.

పీఎంజేజేవైపై కింద సహజ మరణానికీ బీమా

గుడిపాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సహజ మరణ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంగమంగళం స్టేట్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేవై) కింద సహజ మరణానికి రూ.2 లక్షలు చెల్లిస్తారన్నారు. 18-50 సంవత్సరాల మధ్య వయసున్న సంవత్సరానికి రూ.436 చెల్లించి ఏ కారణం చేతనైనా మరణిస్తే బీమా వర్తిస్తుందన్నారు. ఈక్రమంలోనే మండికృష్ణాపురానికి చెందిన మురళి భార్య గిరిజ క్యాన్సర్‌తో సహజ మరణం చెందితే కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కును అందించామన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వితంతువుల పింఛన్ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 3న కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి కేవీ రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు, వితంతువుల సమస్యల పరిష్కారం కోసం రక్షణ మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టిన సిస్టం ఫర్ పింఛన్ అడ్మినిస్ట్రేషన్- రక్ష వెబ్ ఆధారిత పింఛన్ వ్యవస్థపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమం సికింద్రాబాద్‌కు చెందిన సీడీఏ బృందం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, సమీప జిల్లాలకు చెందిన సుమారు 400 మంది మాజీ సైనికులు, వితంతువులు పాల్గొనే అవకాశం ఉందన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

యాదమరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరకూరు దళితవాడకు చెందిన సీనియర్ ఎస్సీ సెల్ నాయకులు మురుగేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ సోమవారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ అధ్యక్షడు మొరార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి రబీ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిత్రానాయుడు, తెలుగు యువత అధ్యక్షులు గుణ రాయల్ పాల్గొన్నారు.

చెట్టు నరికివేతపై ఫిర్యాదు

గుడిపాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెట్లు నరకడం నేరమని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అరుళ్‌పురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామనత్తానికి చెందిన వేలాది రూపాయలు విలువ చేసే చింత చెట్టును ఆదివారం రాత్రి కొందరు నరికి వేశారు. దీంతో గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.

90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

చిత్తూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో సోమవారం 90 శాతం పింఛన్ల పంపిణి పూర్తి చేశారు. 4554 పింఛన్లకు గాను సాయంత్రానికి 4,174 మందికి పింఛన్లు అందజేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో పరుశురాం తెలిపారు. మిగిలిన 380 కూడా అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైందని, మంగళవారినికి పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మట్టి ఖర్చులకు సాయం అందజేత

ఐరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యగారిపల్లె ఎస్సీ కాలనీలో మృతి చెందిన కృష్ణమ్మ కుటుంబ సభ్యులకు సోమవారం మెదరమిట్ల మోహన్,శంకర్‌నాయుడు,పార్వతమ్మ చారిటబుల్ ట్రస్టు తరఫున రాజశేఖర్‌నాయుడు పది వేల రూపాయలను అందించారు.

వాడవాడలా ఎయిడ్స్ అవగాహనా ర్యాలీలు





చిత్తూరు నగరంలో విద్యార్థులు,అధ్యాపకుల ర్యాలీ- కార్వేటినగరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పూతలపట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక పాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి సంక్రమణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహ ప్రసాద్, సూపర్‌వైజర్ నూర్జహాన్, ధర్మేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. **చిత్తూరు సెంట్రల్:** స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామింగ్ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో నగరంలోని జూనియర్ కళాశాలలు విద్యార్థులు అవగాహన ర్యాలీలు ద్వారా గాంధీ విగ్రహం చేరుకున్నారు. విద్యార్థినులు, అధ్యాపకులు ప్లకార్డులు, బ్యానర్లు చేపట్టి, ర్యాలీలో పాల్గొన్నారు. **తవణంపల్లె:** మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వైద్యాధికారులు ప్రియాంక, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **యాదమరి:** మండలకేంద్రంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు లత, సుబ్బారావు, హరిబాబు పాల్గొన్నారు.

పెనుమూరు: మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శారద ఎన్ఎస్ఎస్ పీవో ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి వనజ, సిబ్బంది పాల్గొన్నారు. **నింద్ర:** మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారి సుమలత వినీషా మాట్లాడుతూ హెచ్ఐవీ కలిగిన వ్యక్తులతో లైంగిక సంబంధం ద్వారా ఇతరులకు వ్యాప్తి జరుగుతుందన్నారు. **ఐరాల:** స్థానిక ఆసుపత్రి సిబ్బందితో పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్ప ర్యాలీ నిర్వహించారు. **శ్రీరంగరాజపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.షమామ్ రహ్మాన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. **గుడిపాల:** బొమ్మసముద్రం,గుడిపాల ఆరోగ్య కేంద్రాలు, సీఎన్ఆర్ కళాశాలల్లో ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. వైదాధికారులు సంధ్య,రష్మిక మాట్లాడారు.

వైభవంగా మునేశ్వరస్వామి గోపుర ప్రతిష్ఠ

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం మర్రిమాను వీధిలో వెలసిన శ్రీ మునేశ్వర స్వామివారి దేవాలయ గోపుర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా, పవిత్రంగా జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం తరఫున ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొత్తపేటలో వెలసిన మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయప్పస్వామి ఉత్సవ మహాయాగానికి ఆయన హాజరయ్యారు. అయ్యప్ప స్వాముల పూజల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక కైంకర్యాలు సమర్పించారు.

విద్యార్థుల శ్రమదానం

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం కరకమంద బస్టాండు, చెన్నమల్లయ్యతాత ఆలయం వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ఇంటింటా పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య సంరక్షణ కరపత్రాలను అందజేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, సర్పంచి వెంకటరమణ పాల్గొన్నారు.